# "ఇదుగో నువ్వు కాస్త యిట్లా వస్తావా!"

## డాక్టర్ భానుమతీ రామకృష్ణ

**ఈ మధ్యే మా యింట్లో కొత్తగా భార్యని వదిలేసిన రంగా అనే తోటవాడూ, భర్తల్ని విడిచేసిన యిద్దరు ఆడవాళ్ళూ పాచిపనికీ, పై పనికీ చేరారు.**


**కాలం మారింది! ఒకప్పుడు మా అత్తగారు మా యింట్లో పనికి భార్యాభర్తలుగా చూసి అదీ వాళ్ళ యోగ్యతలు వడియకట్టి మంచి వాళ్ళని ఆమెకు తోస్తేనేవాళ్ళకి పనిచ్చి వెనక గొడ్ల కొట్టం పక్క గదిలో వుండనిచ్చేది తోట పనికీ, పాచిపనికీ! ప్రస్తుతం అట్లాంటి జోడు కుదరక పోగా, పనిలోకి వచ్చే ఆడా, మగా, చాలా వరకు భర్త విడిచేసిన భార్యగానో, భార్య చేత విడువబడ్డ భర్తగానో పని వాళ్ళుగా వస్తున్నారు.**

దాదాపు చాలా ఏండ్లుగా మా యింట్లోవంట వాళ్ళిద్దరూ, వాళ్ళ వాళ్ళ భార్యా పిల్లల్ని వాళ్ళ స్వగ్రామాల్లోనే వదిలి మాకు వంటపనీ, యింటి వ్యవహారాలూ చూసుకుంటూ సొంత ఇంటి మనుషుల్లా మా ఇంటి బాధ్యతలు తీసుకుని ఇంట్లో నుంచి ఒక్కవస్తువు గూడా పోకుండా భద్రంగా చూసుకుంటూ వస్తున్నారు! అంత మంచి వంట వాళ్ళు దొరికిన సంతోషం మాకు మామూలు పనివాళ్ళ విషయంలో కలగక పోవడం కాస్త చీకాగ్గానేవున్నా గత్యంతరం లేక గొడ్లపనికీ, తోట పనికీ పాచిపనికీ ఎవరొస్తే వాళ్ళని పన్లో పెట్టే వాళ్ళు మా వంట వాళ్ళు. పెద్ద యిల్లు-పనివాళ్ళు లేక పోతే జరగదు. ఆ మాట ఒకసారి నేన్నప్పుడు మా అత్తగారికి ఎక్కడ లేని రోషం వచ్చి "ఎందుకు జరగదే! మన యింటి పన్లు మనమే చేసుకుంటాం తీసుకురా పాత్రల్నీ నేనే తోమేసి యిచ్చేస్తానా వంట వెధవలకి" అంటూ హుటా హుటీగా బాత్ రూమ్‌లోకి వెళ్ళి బర్రున కాలుజారి పడి కట్లు విప్పడానికి నెల రోజులు పట్టింది. పట్టుదలలు పనివాళ్ళ విషయంలో ఒక్కొక్కసారి విషమిస్తూండడంచూస్తే అమెరికాలో లాగా ఎవరి పన్లువాళ్ళు చేసుకోక తప్పదేమో అనిపిస్తోంది రానురాను! పనిమనిషి 'కలర్ టి.వి.' వుంటేనే పనికి ఒప్పుకుంటుంది. 'కలర్ టి.వి.'లో పాటలో, పిక్చరో వస్తోందంటే తోమే పాత్ర అవతల పారేసో, చేతిలో చీపిరి చెట్టుకింద పారేసో, ఎక్కడలేని ఆనందంతో వచ్చి యజమాన్లున్నారనే భయభక్తులు కూడా లేకుండా సరి సమానంగా పక్కనే కూర్చుని ఒళ్ళు మర్చిపోయి టి.వి.లో 'శా' సీన్లు, 'డ్యూయెట్' సాంగులూ చూట్టంలో లీనమయి పోతున్న యీకాలం పనిమనుషులే మా యింట్లో కొత్తగా చేరిన గంగ, మంగ, రంగా, గంగ కొడుకు సింగా. ఒకేసారి నలుగురు పనివాళ్ళు కలిసి పనిలోకి రావడం మా యింట్లో యిదే ప్రథమం. అందులో గంగకి ఒక కొడుకు. వాడికి పదమూడేండ్లు, మహా మాటకారి! చూసి రమ్మంటే కాల్చుకొచ్చే రకం వాడు. "ఏం చేస్తానమ్మా, తండ్రి ఒదిలేశాడు. నేను చెప్పిన మాట వినడు! యిల్లొదిలి సినిమా థియేటర్లో పనికి చేరాడు. రెండు నెల్లయింది నా దగ్గరికొచ్చి. ఏదో మీరే వాడికీ పనియిచ్చి కాపాడండి" అని గంగ కంట తడి పెట్టింది!

ఆఫీస్ బాయ్‌గా వేద్దాంలే అనుకుని సరే వుండనీ అన్నాను. ఇంత మంది పనివాళ్ళు మాకు కావాలనిపించింది. ఎందుకంటే మా నాన్నగారి పినతండ్రి మనవడూ ఆయన కుటుంబం మా యింటి వెనకభాగం గదులన్నీ ఖాళీగా వున్నందువల్ల నేనే వుండమన్నా. వాళ్ళకూ కాస్త పనికి సహాయంగా వుంటారనే ఉద్దేశంతో వుండమన్నా కొత్తగా వచ్చిన నలుగురు పనివాళ్ళనీ –

ప్రొద్దుట లేస్తే నా పూజా పునస్కారాలతో బాటు అన్నయ్య వదినె వెనక గదుల్లో పూజలూ పునస్కారాలూ చేస్తు వుంటంతో మా యిల్లు ఒక పవిత్ర దేవాలయంలా తయారయింది. అగరు వత్తుల గుభాళింపుతో చందనకర్పూరాది సువాసనలతోనూ –

కొత్తగా వచ్చిన పనిమనిషి గంగ కురూపి కాకపోయినా చూట్టానికి బాగానే వుండేది. కాని ఏదో విచారం గంగ ముఖంలో ఎప్పుడూ తాండవిస్తూండేది లోతుగా చూస్తే! పైకి నవ్వుతూనే మాట్లాడేది... దాని కొడుకు ఒక కొరివి అని దిగుల్తోఅలా వుందేమో అనుకున్నాను. కానీ మంగ చాలా చలాకీ మనిషి. ఎప్పుడూ తల్లో మల్లెపూలు పెట్టుకుని హుషారుగా కూనిరాగాలు తీస్తూ పై పై పన్లుచేసేది. కారణం మా సీనియర్ వంట వాడు ముత్తయ్యదాన్ని చీపిరి పట్టనివ్వకుండా పాచి పనంతా గంగనెత్తికి కట్టేవాడు. అంట్లన్నీ గంగ లేవగానే వేసేవాడు! గంగ ఓర్పుగా అన్ని పన్లూ చేసుకు పోయేది. దానికి బెడదంతా దాని కొడుకు సింగడుగాడు. వాడు మట్టి కుదుళ్ళల్లో పెట్టినా వుండేవాడు కాదు. సింగడు వయసు పదమూడైనావాడి అనుభవం అరవై మూడులా మాట్లాడేవాడు. రాజకీయాల దగ్గర్నుంచి సినిమా రంగందాకా వాడికి తెలియని విషయం లేదు. వాణ్ణి చూస్తే వంట వాడు ముత్తయ్యకి ఒళ్ళు మంట. వాడికి ఒట్టి గొడ్డు పులుసువేసి అన్నం పెట్టేవాడు. గంగకీ అంతే! కానీ మంగకి స్పెషల్‌గా వేపుళ్ళూ గట్రా చేసి పక్కనే వుండి వడ్డించేవాడు. ఆ వడ్డించిన పదార్థాలు కొన్ని చాటుగా తీసుకెళ్ళి మంగ పెరటి వేపు బావి చాటున కూర్చున్న రంగాకి పక్కనే కూర్చుని తినిపించేది. అది చూసిన వదిన గారు నాకేదో చెప్పాలని గబగబ నా గది దగ్గరకొచ్చి "వదినా! భోంచేశారా!"అంటూ వచ్చి నాచెవి దగ్గరగా "మరే" అని ఏదో చెప్పబోతుంటే వెనక నుంచి అన్నయ్య గబగబ వచ్చి "ఇదుగోనువ్వు కాస్త యిట్లా వస్తావా!"అంటూ వదిన్ని గద్దించి పిల్చారు – పాపం వదినె ఖిన్నురాలై వెనక్కి తిరిగి వెళ్ళి



పోయింది. దీని భావమేమి తిరుమలేశా! రంగాకి మంగా చాటుగా అన్నం పెట్టడం చెప్పడానికొచ్చిందా! అది నేను మేడ మీది కిటికీలోంచి చూశాను. మరేంటి! ఏం చెప్పాలని వచ్చింది. వాళ్ళ కుటుంబ విషయమేమైనా అయివుండచ్చులే అని సరిపెట్టుకున్నా. తను మంగకిచ్చిన పదార్థాలు తీసుకెళ్ళి మంగ పెరట్లో రంగా కివ్వడం చూసిన ముత్తయ్యకి ఒళ్ళు భగ్గుమన్నది. మంగతో మాట్లాడ్డం మానేసి చిర్రు బుర్రు లాడ్డం చూసిన మంగా ముత్తయ్యను ఎట్లా బుట్టలో వేయాలో తెలుసుకుని "ముత్తయ్యా! ఎప్పుడూ నువ్వేవంట చెయ్యాలా! ఆ రెండో ఆయన చెయ్యగూడదూ! నీకు మోకాళ్ళు నెప్పలంటూ వున్నావే! వుండు కాస్త అమృతాంజనం పట్టిస్తా" అంటూ ముత్తయ్య మోకాళ్ళకి బలవంతంగా అమృతాంజనం పట్టించడం మొదలెట్టింది. ముత్తయ్య కోపం అంతా ఎగిరి పోయింది. మంగ స్పర్శతో మైమరిచిన ముత్తయ్య "మంగా! ఆ రంగా ఎదవ ఎవడే? వాడంటే నీకు ఎందుకంత యిష్టం?" అని అడిగాడు వుండబట్టలేక.

"ఆ చెప్పనా! నీ కంటే వయసోడూ! అందగాడూ! అందుకే యిష్టం!" అన్నది ముత్తయ్యని ఉడికిస్తూ... ముత్తయ్యచివాల్న లేచి "అయితే నిన్ను మొగుడొదిలేశాడన్నావుగా, పోనీ ఆ రంగా గాణ్ణే కట్టుకో!" అన్నాడు కోపంతో... మంగా కిలకిల నవ్వుతూ ముత్తయ్య మోకాలు వదలకుండా "ఓ పిచ్చి ముత్తయ్యా! నువ్వొట్టి బుర్రలేని వాడివయ్యా! నువ్వు నేనంటే పడి చస్తున్నావని అందరికీ తెలిసింది" అది విని అదిరిపడ్డ ముత్తయ్య "ఆ! ఎవరు చెప్పారు? ఎట్లా తెలిసింది?"

"ఎట్టగో రంగాగాడికి తెలిసింది గనుకనే వాడెక్కడ అమ్మగారికీ, ఆ వదినెమ్మగారికీ ఎక్కడ చెప్తాడోనని వాణ్ణి కాస్త నేను బురిడీ కొట్టించ డానికే అదీ యిదీ యిచ్చి వాణ్ణి కాస్త దువ్వుతున్నా..." అని వాడికి రహస్యంగా చెప్పడంతో ముత్తయ్య మంత్ర ముగ్ధుడై పోయాడు. కాని మంగా మాత్రం ఎవరూ లేకుండా చూసి రంగాగాడితో రహస్యాలు మాట్లాడుతూండడం వెనక తులసి కోటకు నీళ్ళు పోస్తూ, బట్టలారేస్తూ వెనకనే వుండే వదినె కనిపెడుతూనేవుండేది. ఒక రోజు కిందికెళ్ళి నేను తోటలో చెట్లన్నీ ఎండి పోయి కొన్ని అడ్రసు లేకుండా వేళ్ళతో సహా పీకి పారేయబడి వుండడం చూసి నా ఒళ్ళు భగ్గుమన్నది. తక్షణం రంగాగాణ్ణి కేకేసి పన్లోంచి తీసేద్దామన్నంత కోపం వచ్చి కేక వేశాను. రంగాగాడు ఖంగారు పడిపోతూ "అమ్మగారూ గొడ్డకి ఒంట్లో బాగాలేదండి! అందుకనీ" అని ఏదో చెప్పబోతూంటే వదినె వచ్చి "అవును వదినా అతనికి తీరికేది! మంగతో మాట్లాడ్డానికే వాడికి టైము లేదు పాపం. పూజకి పూలు యిచ్చే చెట్లు నిలువునా ఎండి పోయాయి. మీరు చూసి గుర్తు పడతారనీ పీకి బయట పారేశారు. ఏంటో! చెప్పాలంటే శానావుందిలే వదినా! మరే!" అంటూ వదినె నా చెవు దగ్గరకిరావడం ఎటు నుంచి చూశాడో అన్నయ్య, "ఇదుగో నువ్వు కాస్త యిట్లా వస్తావా!" దాంతో నిప్పు మీద నీళ్ళు జల్లినట్టు వదినె ఏదో చెప్పాలని కుదుపుబ్బరంతో బాధపడుతూన్నదల్లా ఒక వేడి నిట్టూర్పు విడిచి వెళ్ళింది.

వదినె వెళ్ళిం తరువాత రంగా గాడి విషయం మర్చిపోయి వదినె ఏదో ప్రతిసారీ చెప్పాలని రావడం, వెనక నుంచి అన్నయ్య "ఇదుగో నువ్వు కాస్త యిట్లా వస్తావా!" అంటూ కేకెయ్యడం విచిత్రంగా అనిపించింది. గంగకొడుకు సింగడు యింట్లో మాకు చాలా అవసరమైన చిన్న చిన్న వస్తువులు దొంగతనం చేయడం మొదలెట్టాడని వాడంటే సరిపడని మా సీనియర్ వంటవాడు ముత్తయ్య ప్రతిరోజూ కంప్లైంట్ చేయడం నాకు తలనొప్పి కలిగించింది. ఒకళ్ళో ఇద్దరో కాక, ఒకే రోజు నలుగురు పని మనుషులు-ప్రొద్దుట యిద్దరూ, మధ్యాహ్నం యిద్దరూ-వచ్చి పన్లో చేరడం, మేము పనివాళ్ళ కోసం మొఖం వాచి వున్నందున వున్న పళంగా వాళ్ళందరికీ పన్లుయిచ్చేసి జీతాలూ వాళ్ళడిగినవి యిచ్చి పెట్టడంతో యిద్దరు వంటవాళ్ళకూ ఆడ పనివాళ్ళ మీద అభిమానం ఏర్పడ్డా తోటవాడు రంగానీ, గంగ కొడుకు సింగణ్ణీ చూస్తే ప్రతి విషయంలో మండి పడేవాళ్ళు. నేను పనివాళ్ళనీ వంట వాళ్ళనీ కూడా అప్పుడప్పుడు మందలిస్తూండేదాన్ని అది చూసి వదినెగారు నాకేదో చెప్పాలని గబగబ నా దగ్గరకి వచ్చేది, అటూ యిటూ ఎవరూ లేకుండా చూస్తూ! ఏ వైపు నుంచో అన్నగారు చూసేవాడులా వుంది! తక్షణం ఆయన "ఇదుగో నువ్వు కాస్త యిట్లావస్తావా?" అంటూ కేకేసేవాడు! వదినె చటుక్కున చెప్పబోయే దానికి సడన్ బ్రేక్ వేసి వెనక్కి తిరిగి వెళ్ళేది. గంగ కొడుకు సింగడికి పై జేబులోపల జేబు, రెండున్నాయట. వాడు మావంట వాడి వాచీ కొట్టేసి లోపల జేబులో దాచినప్పుడు తెలిసింది. వాణ్ణి కొట్టబోతే నేనే ఆపాను. ఇంకా చాలాతీసి వుంటాడనే అనుమానం కలిగింది. మా యింట్లో నలుగురు పనివాళ్ళూ పెద్ద సమస్యగా తయారయినారు. సింగణ్ణి వేరే చోటికి పంపితే వాడి తల్లి గంగ గూడా వెళ్ళి పోతుంది. అదొక్కర్తే బాగా పని చేస్తోంది ఓర్పుతో. మంగ పైపై తళుకుతో సీనియర్ వంటవాడికి కూరలు తిరిగిచ్చి, వాడి కూడా వుండి, సహాయ పడుతున్నట్టు నటించి కష్టమైన చాకిరీ అంతా గంగ నెత్తికి తోయడం దానికి అలవాటయింది.


"ఇదేమిటి నువ్వు యిల్లు చిమ్మచ్చుగదా!"అని నేను కలగ చేసుకోబోతే మా సీనియర్ వంటవాడు దానికి కవచంలా అడ్డొచ్చేవాడు."దానికి పనివుందమ్మా. వంట త్వరగా కావాలంటే అది లేకపోతే మీకు భోజనం లేటవుతుందనేవాడు. పనివాళ్ళ మీద ఆధారపడ్డ నాకు యీబెడద ఎలా తప్పించుకోవాలో తెలీక టి.వి. ఆన్ చేసి ఏదో చూస్తూ ఆలోచిస్తున్నా. నా దగ్గరికి వదినె వచ్చింది, గాభరాతో అటూ యిటూ చూస్తూ. సింగడూ వెనకాలే వచ్చాడు.

"నువ్వెందుకురా! పెద్దవాళ్ళం మాట్లాడుకునేప్పుడు పో" అన్నది వదినె చిరాకుతో! "భలే వారండీ! టి.వి. వేశారు గదా అమ్మగారు చూద్దామని వచ్చా! అయినా ఏం లాభం లేదు లెండి ఆ సినిమా ఫేల్ అయింది"అన్నాడు. నాకు వాడి మాటలూ ధోరణీ చూస్తే ఒంటికి కారం రాచినట్లున్నా గంగ కోసం వూరుకున్నా. వదినె వాణ్ణి వదలకుండా"నీ కెట్లా తెలుసురా ఆ సినిమా 'ఫేల్' అని" అంటూ నా కంటే ఒళ్ళు మండుతూ వాణ్ణి నిలదీసింది. "ఓస్! ఈ సినిమా నేచూశాగా! నేను సినిమా థియేటర్లో బ్లాక్‌లో టిక్కట్లమ్మేవాడిని యజమాని చెప్తే.. ఈ సినిమాకి ఒక్కడూ కొన్లా. అసలు హీరో హీరోయిన్ సరైనోళ్ళు వళ్ళా. ఏదో కొత్త మొకాల్లేండి. పైగా పైట్లు లేవు. ఎట్ట బోద్దీసిన్మా ఎవురూ చూళ్ళా!"అంటూ వాడి అధిక ప్రసంగానికి వదినె నేనూ కూడా చిరాకు పడిపోతూ "సరే వంతోషించాం గానీ నీ తెలివికీకాస్త బయటి కెళ్ళు మేంకాస్త మాట్లాడుకోవాలి" అంటూ వదినె చెప్పూంటే మంగలోపలి కొచ్చింది. వదినె దాన్ని చూస్తూనే "సరే వదినా ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి" అంటూ మాట మార్చింది. ఈలోగా మళ్ళీ అన్నగారి పిలుపు "ఇదుగో నువ్వు కాస్త యిట్లా వస్తావా?" "సరే వదినా నేను తీరిగ్గా వస్తాలే ఆయనలేనప్పుడు!"అంటూ వెనకాలకి వెళ్ళి పోయింది.

మర్నాడు వెండి గ్లాసు, వెండి స్పూనూ, సీనియర్ వంట వాడు ముందు రోజు తీసుకున్న అడ్వాన్సు అయిదు వందల రూపాయిలూ, వాడి వాచీ, వరస బెట్టి అన్ని వస్తువులూ కనిపించలా!సీనియర్ వంటవాడు ఖంగుతిన్నాడు.

అమాంతం రంగాగాడి మీదికీ, సింగడి మీదికీ వాడి అనుమానం పెనుభూతంలా దూకింది. అది గ్రహించిన మంగ "ఏమయ్యోయ్ ముత్తయ్య! నీ అనుమానం ఏదో కొత్తగా పన్లోకొచ్చినోళ్ళ మీదున్నట్టుంది!...ముందు నా పెట్టె చూపిస్తా రావయ్యా!..."అంటూ ముత్తయ్యని లాక్కెళ్ళింది. దాని పెట్టె తీస్తే సెంటు బాటిలూ, మంచిమంచి సోపులూ, షాంపులూ, జపాన్ నైలెక్స్ చీరలూ చాలా వున్నాయి. ముత్తయ్య అనుమానం ఆ రంగాగాడి మీదే వుండడం వల్ల "ఏరా! నీ పెట్టె ఎక్కడ?" అంటూ గద్దించాడు.

రంగా అలక్ష్యంగా నవ్వుతూ "పెట్టే, నాకా, నువ్వు కొనిచ్చావా! నువ్వు వంటోడివైతే కావచ్చుగానీ ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్టాడు. ఇట్టాంటి చిల్లర యవారాలు నాకలవాట్లేదు"




అంటూ పక్కన కిందికి వాలిన మునగచెట్టుకొమ్మ టపీమని కత్తి తీసి నరికి అవతల పారేశాడు! అది చూసిన ముత్తయ్య తక్షణం వంటింట్లోకి గబగబ వెళ్ళిపోయాడు, అక్కడే వుంటే ఆ కత్తితో తన మీద పడొచ్చనే భయంతో.

ఆ పూట వంట రెండో వంటవాడు చేశాడు. మతిపోయినట్టు యిల్లంతా వెతుకుతున్న ముత్తయ్యకి సింగణ్ణి రెండు తగిలించి అడగాలనిపించి "ఏరా! నువ్వే అన్ని గదులూ తిరుగుతుంటావ్! నీకు తెలీకుండా యిన్ని ఒకేసారి ఎట్లా పోతాయిరా!" అని ముత్తయ్య వాణ్ణి డబాయించేసరికి వాడు 'టిపికల్' సినిమా స్టైల్లో "ఏంటయ్యోయ్ ముత్తయ్యా! ఏదన్నా ఫారిన్ వాచీ అయినా తీసేవాణ్ణి...పైగా యిట్టా చిన్న చిన్న వాటితో నే సరిపెట్టుకొనే రకం గాదు,నీకు తెలియదేమో! మర్యాదగా మాట్టాడు" అని వాడు ముత్తయ్యని వదిలించి పారేస్తుంటే నాకు నవ్వాగలేదు.

"ఏంటమ్మగారూ! నా గడియారం, మా గదిలో వెండి కుందులూ, గ్లాసూ పోతే మీరు నవ్వతారేంటి!" అంటూ ముత్తయ్య ఆవేశపడిపోతుంటే మంగ వచ్చి మెల్లిగా "ముత్తయ్యా!

యిదిగో నీ గడియారం'' అంటూ తెచ్చి యిచ్చింది. ప్రాణం లేచి వచ్చిన ముత్తయ్య ''మంగంటే మంగే'' అంటూ దాన్ని మెచ్చుకుంటూ ''ఎక్కడ దొరికింది మంగా!'' అని అడిగాడు. ''ఏడిసినట్టుంది ముత్తయ్యా! నువ్వు స్నానం చేసి బాత్‌రూము గూట్లో పెట్టి మర్చిపోయొచ్చావ్. బలే మతిమరుపు మనిషివి ముత్తయ్యా!'' అంది మంగా ముసి ముసి నవ్వుతో.

''సరే నా వెండి కుందులూ, వెండి గ్లాసూ, స్పూను అవి ఎక్కడ?'' అన్నాడు.

''అయ్యో యిట్టనే దొరుకుతాయేమోలే! అసలు నువ్వు తోమడానికి వేశావా? వేస్తానని తీసుకొచ్చి ఎక్కడన్నా పెట్టావా! చూడూ'' అంటూ వంటగది అల్మేరాలన్నీ వెతకడం మొదలెట్టింది. ఆశ్చర్యం వెండి కుందులూ, గ్లాసూ, స్పూను అన్నీ అల్మేరా పూరగాయ జాడీల మధ్య వున్నాయి.

సీనియర్ వంటవాడికి మతి చెడిపోయింది. **ఒక వైపు అన్నీ దొరికినయ్యన్న** సంతోషం వున్నా ఆ సామాన్లు **తనెందుకు అక్కడ పెట్టాలి! అనే** సందేహం లోలోపలే పీడిస్తుంటే ''సరే నాకు



వయసు మళ్ళుతూందిలే! మర్చిపోతూంటా మంగా! నువ్వు గట్టిదానివి తీసిచ్చావ్! యిక నిన్ను నమ్ముతా! మరి నా డబ్బుఅయిదొందలూ!...అదెక్కడ పెట్టానో'' అన్నాడు బుర్ర గోక్కుంటూ ముత్తయ్య.

''అదే నీ మతిమరుపు మా అందరి మీదా అనుమానం కలగ జేస్తావుంది...భలే వోడివయ్యా! ఒక్కసారి నువ్వు యిడిచేసిన చొక్కా జేబులో గూడా ఎతికి చూసుకో! ఎనకటికి ఒళ్ళో పిల్లని పెట్టుకుని వూరంతా ఎతికిందంట ఎవతో!'' అంటూ తనే గబగబా వెళ్ళి ముత్తయ్య విడిచిన చొక్కా ఒంకికి తగిలించిన దాన్ని తెచ్చి యిచ్చింది. జేబులో చూస్తే ఆ అయిదు వందలూ వున్నాయి. ముత్తయ్య ఆనందానికి మేరలేదు-రెండో వంటవాడు ముసి ముసి నవ్వుల్తో ముందు హాల్లో కెళ్ళిపోయాడు. సీనియర్ వంట వాడికీ జూనియర్ వంట వాడికీ షష్టాకం. **ఇద్దరూ** మాట్లాడుకోరు-వీళ్ళకి మీడియేటర్స్ పనివాళ్ళు. అప్పుడప్పుడూ నేనే! వాడు తీశాడేమోనని గూడా ముత్తయ్య అనుమాన **పడకపోలేదు** కాని వాడు అట్లాంటి వాటి జోలికి పోడు. అన్నీ దొరికే సరికి ముత్తయ్య **ఆ రోజు పండగన్నట్టు** వడలూ, పాయసం చేశాడు.

నాకు నవ్వొచ్చింది. **మన** వస్తువులు మనకు దొరికితేనే ఎంతో ఆనందమైతే కొత్తగా కొంటే యింకా ఏం చేస్తాడోనని...అయినా అంతసేపూ అందరూ వెతికినా కనిపించని ఆ చోట్లల్లోనే మంగకి యిట్టే దొరకడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. వదినె ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ నా వైపు చూసి తర్వాత చెప్తానన్నట్టుగా సైగ చేసింది. మంచివేళ. అన్నగారు చూడలా! లేకపోతే ''యిదుగో కాస్త యిట్లా వస్తావా?'' అనేవాడు. వదినె కడుపులో ఏవో గంపెడు రహస్యాలున్నట్టు అవన్నీ ఆవిడ నాకు చెప్పాలని ఏదో తహతహలాడుతున్నట్టు నన్ను పిలిచింది. కాని అన్నయ్య అవకాశం యివ్వడం లేదు.

ముత్తయ్యకి మాత్రం మంగంటే అపారమైన అభిమానం కలిగింది. తన జ్ఞాపక శక్తి మీద తనకే నమ్మకం పోయింది. నెమ్మదిగా విలువైన వస్తువులుండే బీరువా తాళాలు, అల్మేరా తాళాలు వెండి స్త్రాతలుండే బీరువాలవి దాని చేతికిచ్చి వస్తువులు తేవడం తిరిగి లోపల పెట్టడం లాంటిది చేయించడం మొదలెట్టాడు! అది చూసి గంగ కొడుకు సింగడు తనూ

తాళాలు తీయబోతే వాణ్ణి కసిరి కొట్టేది, ''సామాను పోతే నా నెత్తిమీదికి రాదూ'' అంటూ. పైగా వాణ్ణి ఆ ప్రాంతాలకి రానియ్యొద్దనీ, వాడొట్టి దొంగ పిల్లవాడనీ ముత్తయ్యకి చెప్పింది.' దాంతో ముత్తయ్య సింగడికి మామూలుగా వేసే గొడ్డు పులుసు గూడా వెయ్యకుండా ఒట్టి నీళ్ళ మజ్జిగ వాడి మొహాన పోసి ''పోరా వెధవా! నీకు కొవ్వెక్కింది''అంటూ తిట్టేవాడు. ముత్తయ్యకి రంగాగాణ్ణి వాడి చేతిలో కత్తినీ చూస్తే ఒణుకు పట్టుకుని మంగ కూడా లేకుండా పాలుపిండడానిక్కూడా గొడ్ల కొట్టంవేపు వెళ్ళడం మానేశాడు!

పోయిన డబ్బూ, వాచీ, వెండి సామాన్లు దొరికి నప్పట్నుంచీ ముత్తయ్యకు మంగ మీద ఎక్కడలేని అభిమానం ఏర్పడ్డది. ''మనిషి కాస్త వెకిలిగా వున్నా దాని మనసు మంచిదమ్మా!'' అనేవాడు నాతో...కాబోలు అనుకుని వూరుకున్నా బాధ్యతంతా ముత్తయ్య మీదే సంవత్స రాలుగా వదిలిన నేను.రాను రాను ముత్తయ్య మంగకి బీరువా తాళాలు,పూజా సామాన్లుండే వెండి అల్మారా తాళాలూ, స్టోర్ రూము తాళాలూ అన్నీ యివ్వడం మొదలెట్టాడు. తను స్నానానికి పోతున్నా, కూరగాయలకు, యితర పన్లకూ బయటికెళ్ళి రావల్సున్నా యింటి బాధ్యతంతా మంగ మీదే వదిలి వెళ్ళడంతో రెండవ వంట వాడికి ఒళ్ళు మండి నా దగ్గర పది హేను రోజులు లీవు తీసుకుని సొంత వూరికెళ్ళి పెళ్ళాం పిల్లల్ని చూసొస్తానని వెళ్ళాడు.

రెండవ వంటవాడు వూరికెళ్ళానే మంగ మరికాస్త వీరవిహారం చేయడం మొదలెట్టింది.

ముత్తయ్య కూతురుకు కొడుకు పుట్టాడనీ మనవడికి బంగారు గొలుసు కొని మెళ్ళో వేసి రావాలనీ, మురిసిపోతూ ముత్తయ్య జీతం అడ్వాన్సు మూడు వేలు నన్నడిగి తీసుకుని మనవడికి బంగారు గొలుసూ, తను చేర్చి పెట్టుకున్న డబ్బుతో కూతురికి కొత్త చీర, అల్లుడికి జరీ పంచలూ గట్రా ఏవో తీసుకొచ్చి పెట్టెలో పెట్టుకున్నాడు. మర్నాడు వెళ్ళి అంబత్తూర్‌లో వున్న కూతురుకు యిచ్చి రావాలని లీవ్ గూడా అడిగాడు. సరేనన్నా. అనుకోకుండా మర్నాడు అంబత్తూర్ నుంచి ఫోనొచ్చింది ముత్తయ్యకు. వాళ్ళ అక్కకు చాలా సీరియస్‌గా వుందని, వెంటనే రమ్మనీ! ముత్తయ్యకి అంబత్తూర్ నుంచి ఫోన్ సాయంకాలం ఏడు గంటల ప్రాంతాలలో వచ్చింది-అప్పటికే నాకు రాత్రి టిఫిన్ రెడీ చేసిపెట్టాడు. మంగతో మజ్జిగ చిలికి అమ్మగారికి టిఫిన్ యిచ్చిన వెంటనే యివ్వాలని వివరాలు చెప్పి, గంగతో సంగడితో అమ్మగారి దగ్గరే వుండండి అంటూ జాగ్రత్తలు చెప్పి **యిల్లంతా మంగకి** ఒప్పజెప్పి ఇంగాల్లో ఎక్కడ తాళాలు

అక్కడే వదిలేసి బస్సు ఛార్జీ డబ్బులు మాత్రం నన్నడిగి తీసుకుని ఆదరాబాదరా అంబత్తూర్ బస్సెక్కిపోయాడు.

నాకెందుకో ముత్తయ్య అటు పోతూనే రెండో వంటవాడు గూడా వూర్నుంచి రానందువల్ల కొత్త పనివాళ్ళ మధ్యలో ఒంటరిగా వుంటానికి భయం వేసినా వెనక వదినె వాళ్ళున్నారుగదా అని ధైర్యం తెచ్చుకొన్నా! తీరా చూస్తే మధ్యాహ్నంగా వదినె, అన్నయ్యా రెండో కూతురికి ఒళ్ళు బాగాలేదని చూసి రావడానికి జార్జిటౌన్ కెళ్ళారట! ఆ సంగతి మంగ చెప్పగానే ఎందుకో నా గుండె భయంతో వేగంగా కొట్టుకోడం మొదలెట్టింది. "వదినె వాళ్ళు ఎప్పుడొస్తారు!" అని అడిగాను. "చెప్పలేదమ్మా! రేపు పొద్దున్నే వస్తాం అన్నట్టు గుర్తు" అన్నది నాకు టిఫిన్ తెచ్చిస్తూ. ఆ రోజు రాత్రి నిద్ర పట్టలేదు. ఎందుకైనా మంచిదని ఆ రాత్రి ఎప్పుడూ లేంది నా గది తలుపు లోపల గడియ వేసుకుని పడుకున్నాను. తెల్లవారి నిద్ర లేస్తూనే మామూలుగా మర్చిపోయి ముత్తయ్య కోసం టీ తీసుకు రావడానికి కాలింగ్ బెల్ నొక్కాను. ఎంతకీ ఎవరూ రాకపోయేసరికి అప్పుడు ముత్తయ్య యింకా వచ్చి వుండడనుకుని పని మనుషులు వాళ్ళ వాళ్ళ పనుల్లో వుంటారనుకుని నేనే లేచి గదితలుపులు తీసి బయటికెళ్ళా. ఇల్లంతా బావురు మంటోంది. ఎవరూ లేరు. గుండె గతుక్కుమంది. ఎదురుగా వదినె రావడం చూసి ఖంగారు పడిపోతూ "వదినె! మా పనివాళ్ళెక్కడ!" అని అడిగా! ఆవిడ ఏడవలేక నవ్వుతూ "ఏం చెప్పమంటావు వదినా! అసలు ఎప్పుడో చెప్తామనుకొంటే మీరు పనివాళ్ళు లేక అవస్థ పడుతున్నారని మీ అన్నయ్య ఆ దొంగ పాపిష్టి పనివాళ్ళ గురించి మీకు చెప్పనిచ్చాడు కాదు. నిన్న మేమూ రెండో పిల్లని చూట్టానికి టౌను కెళ్ళి తెల్లారుగట్ల వచ్చాం."

"వాళ్ళేరీ ఎక్కడున్నారు ఆ నలుగురూ!"


"ఇంకెక్కడున్నారు వదినా! ఆ ముత్తయ్య వచ్చిన వాడికి కాస్త చపల బుద్ధి వుండడంవల్ల ఆ మంగ వాడిని బుట్టలో వేసుకుని శుభ్రంగా చేతికి దొరికినవన్నీ పట్టుకెళ్ళి పోయారులా వుంది."

"ఆనలుగురూ ఒకేసారి పోయారా! మరి గంగా, సింగడూ, రంగా-"

"గంగా లేదు మంగా లేదు. ఆ రంగాగాడి మొదటి పెళ్ళామే గంగ. దాని కొడుకు సింగడు. గంగ అమాయకురాలు. అది నోర్లేంది గనక మంగని తెచ్చుకున్నాడు." నా బుర్ర గిర్రున తిరిగింది.

"మరి గంగ వేరే వూరు, దాని భర్త వదిలేశాడనీ, మంగ వేరే దాని భర్త మరో పెళ్ళి చేసుకున్నాడనీ, రంగాగాడు పెళ్ళాన్ని వదిలేశాడనీ, వాళ్ళు పనిలో చేరేప్పుడు మనతో చెప్పారే?"

"అంతా వట్టి అబద్ధం. వాళ్ళ నలుగురూ ఒకే కుటుంబం. ఆ సంగతి నేను ముందే కనిపెట్టా. ఒక్కొక్కసారి నా నోరు నొక్కుతూ వచ్చాడు మీ అన్నయ్య. మంచి వేళా, మీ గది లోపల గడియ పెట్టుకున్నారు గనక వంటింట్లో సామాన్లు, మిగతావీ, వంట వాడి పెట్టే పట్టుకెళ్ళిపోయారు. లేకపోతే ఎంత డేంజరు? అబ్బబ్బ! తల్చుకుంటే ఒణుకు పుట్టుకొస్తోంది వదినా" అని వదినె చెప్తూంటే నాకు మతిపోయినట్టయి అలాగే గోడకి చేరబడ్డా! వదినె ఖంగారు పడుతూ టీ చేసి తీసుకొచ్చి నాకిచ్చి "పోన్లే వదినా! పీడా వదిలింది. వాళ్ళే యింకా వుంటే వాళ్ళు ఏం పెద్ద ఎత్తులు వేసేవాళ్ళో! కాలం చెడ్డది! ఆ కుటుంబం ఒక దొంగ కుటుంబం. వెంటనే ఆ దొంగల ముఠా కుటుంబాన్ని పోలీసులకు పట్టించండన్నామీ **అన్నయ్యతో**! ఆయనకసలే భయం!"




**"ఎందుకు లెద్దూ. పోయిన వస్తువులు పోనే పోయాయి. ఆ దొంగల ముఠా యిల్లు వదిలి** వెళ్ళారు. అంతే చాలు అదే పదివేలు **అంటున్నారు.**" అప్పుడే స్నానం చేసి వచ్చిన అన్నయ్య అది విని "అవునమ్మా! ఏ సామాన్లు పోయినయ్యని కంప్లైంట్ యిస్తాం. మీ స్టోర్ రూము, వంటిల్లు తాళాలూ అవీ ఆ మంగ చేతిలో వుంటే ఏం పట్టికెళ్ళారో నీకు మాత్రం తెలుసా! ఆ వంట గాడిద వస్తేగాని తెలీదు. పని మనిషికి తాళాలిచ్చి వెళ్ళాడే" అంటూ అన్నయ్య ఆవేదన పడ్డాడు.

"అందుకే బాగా జరిగింది. వదినా! అన్నట్టు వాడి పెట్టె పట్టికెళ్ళి పోయారు తెలుసా!" అన్నది సంబరపడిపోతూ. షాక్ కొట్టినట్టు "నిజంగానా" అన్నాను.

"అవును వదినా! మేం వస్తూనే ముందు పనివాళ్ళ గదే చూశాం! "అయ్యో పాపం వాడి మనవడికి బంగారు గొలుసూ, కూతురూ అల్లుడికి కొత్త బట్టలూ మొన్ననే కొని పెట్టాడు. కొన్ని వేల రూపాయిల వస్తువులు! తెలిస్తే భోరున ఏడుస్తాడే ముత్తయ్యా!" అని నేను వాపోతుంటే వదినె, "వాడి క్కావాల్సిందే వదినా! ఆ ముత్తయ్య గాడిద వల్ల వచ్చిన ముప్పేగదా యిది! ఆ మంగా మాయలోబడి వాడికే చేటు తెచ్చుకున్నాడు. అంతే కావాలి వాడికి. ఆ దొంగ ముఠా కుటుంబం మనింట్లోనేకాక చాలా చోట్ల యిట్లాగే చేసుంటారని నా అనుమానం. అన్నట్టు పూజ గదిలో వెండి దీపాలవీ వున్నాయే ఆ తాళాలూ వాడు మంగకివ్వలేదు గదా!"

"లేదు పూజ గది తాళాలు నా గద్గరే యిస్తాడెప్పుడూ" అన్నాను. "పోన్లే ఆ అమ్మవారు కాపాడింది" అని అంటూండగానే ముత్తయ్య వచ్చాడు. అంతా విని షాక్‌తో కొయ్యబారి పోయాడు. "ఇదంతా నీవల్లే వచ్చింది. ఆ మంగ చేతికెందుకిచ్చావ్ తాళాలూ! నీ కేంటి అంత నమ్మకం దాని మీద" అంటూ ఒళ్ళు మంటతో వదినె నిలదీసి అడిగింది ముత్తయ్యను. మూడూ, నాలుగు వేల రూపాయిలు చేసే మనవడి బంగారు గొలుసూ, కూతురికి అల్లుడికీ కొన్న బట్టలూ, ముందు రోజు తీసుకున్న జీతం, చేతి గడియారం అన్నీ పెట్టి తాళం వేసిన పెట్టెకు పెట్టె అమాంతంగా పోయి దివాలా తీసినట్టు నిర్జీవంగా నిలబడ్డ ముత్తయ్య అత్తమీద కోపం దుత్త మీద చూపించినట్టు వదినె మీద మండిపడుతూ "అసలు మీరంతా వెనకే వాళ్ళని చూస్తున్నారుగా! వాళ్ళు యిట్లాంటి వాళ్ళని అమ్మగారికో, నాకో మీరు చెప్పి వుండొచ్చుగా! అన్నీ తెలిసీ అప్పుడు వూరుకోని యిప్పుడు సామాన్లు పోయాక నా తప్పంటం బాగుందామ్మా!" అని కోపంతో ముత్తయ్య వదిన్ని నిలదీసి అడిగేసరికి వెనక నుంచి అన్నయ్య పిలుపు వినిపించింది. అదే పిలుపు "ఇదిగో నువ్వు కాస్త యిట్లా వస్తావా!" అంటూ...